# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-06-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. తక్కువ నీటితో ఎక్కువ మొక్కలను పెంచే సాంకేతికతను నాసిన్‌లో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టామని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారామన్ చెప్పారు.
2. ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించాల్సిన అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
3. తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా జలాలను రైతుల అందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.
4. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి.
5. బక్రీద్ పర్వదినాన్ని ముస్లీంలు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ సత్యసాయి జిల్లా నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ – నాసిన్ లో నిర్వహించిన "డెడికేషన్ ఆఫ్ బయోడైవర్సిటీ" కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారామన్ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవవైవిధ్య ఉద్యానవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తక్కువ నీటితో ఎక్కువ మొక్కలను పెంచేలా "బాయావకి" అనే జాపనీస్ సాంకేతికతను నాసిన్‌లో పైలెట్ ప్రాజెక్ట్‌గా మొదలు పెడుతున్నామని చెప్పారు. వీటి ద్వారా వర్షాభావం ఉన్న ప్రాంతంలో ఎక్కువగా మొక్కలు పెంచవచ్చని నిర్మలా సీతారామన్ తెలుపుతూ,

వాయిస్ ..30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా, గోదావరి డెల్టాలలో పంటల సాగును చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశ నిర్ణయాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులకు వెల్లడించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలో

నిర్మించాల్సిన అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయనున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలుపుతూ,

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

పర్యాటకభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి వద్ద జరుగుతున్న మసులా బీచ్ ఫెస్ట్ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉద్యోగవకాశాలు పర్యాటక రంగంలో సృష్టించవచ్చని తెలిపారు. మచిలీపట్నం పర్యాటకభివృద్ధి కోసం మసులా ఫెస్ట్ – 2025 నిర్వహించుకుంటున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలోని పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా జలాలను రైతుల అందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట మండలంలో 13, జడ్చర్ల నియోజకవర్గం నవాబ్‌పేట మండలంలో 17 విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి. ఈ ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు మే 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగాయి. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు తమ ఫలితాలను resultsbie.ap.gov.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది.

---------------------------

బక్రీద్ పర్వదినాన్ని ముస్లీంలు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ముస్లింలు జరుపుకునే పండుగల్లో రంజాన్ తర్వాత బక్రీద్‌కు అత్యంత ప్రాముఖ్యతనిస్తారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారు.

బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్లు ఎస్.అబ్దుల్ నజీర్, జిష్ణు దేవ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు తమ శుభాకాంక్షలు తెలియచేశారు.

బక్రీద్ పండుగ త్యాగానికి నిస్వార్థ పూరిత ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని.. సమాజంలో అట్టడుగు వర్గాలకి, పేదలకు సహాయం చేయాలనే సందేశాన్ని ఇస్తుందని వారు తమ సందేశాల్లో పేర్కొన్నారు.

---------------------------

"ఆహార భద్రత- సైన్స్ ఇన్ యాక్షన్" అనే ఇతివృత్తంతో ఈరోజు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 2018 సంవత్సరం నుండి ప్రతి ఏటా జూన్ 7వ తేదీన ఆహార భద్రతా దినోత్సవం జరుగుతోంది. పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం తీసుకోవలసిన ఆవశ్యకత పట్ల ఈరోజు అవగాహన కల్పిస్తున్నారు. సమతుల ఆహారం తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించడం, కలుషిత ఆహారం వల్ల జరిగే అనర్థాలను వివరించడమే లక్ష్యంగా ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో నూరుశాతం అక్షరాస్యత కోసం ప్రాజెక్ట్ అ-ఆ అక్షర ఆంధ్రను ప్రారంభించామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడేళ్ల తర్వాత విజయవంతంగా డీఎస్సీ చేపట్టామని తెలిపారు. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహణ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసి విద్యాప్రమాణాలను మెరుగుపరుస్తామని చెప్పారు. రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రంలో ఆదర్శ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివరించారు.

---------------------------

పరిశ్రమల అవసరాలకు తగినవిధంగా నైపుణ్య శిక్షణ అందించి యువత ఉద్యోగాలు పొందడంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి-టాస్క్ కీలక పాత్ర పోషిస్తోందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో టాస్క్' కార్యక్రమాలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరంలో 6 వేల మంది నిరుద్యోగులకు ఆధునాతన సాంకేతిక శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకొవాలని టాస్క్ అధికారులను మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు.

---------------------------

ఎరువులు, పురుగు మందులు వాడకం లేకుండా రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నంద్యాల మండలం అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణ మాట్లాడుతూ, పచ్చిరొట్ట ఎరువులు వాడాలని, దీని ద్వారా భూమిలో కర్బన శాతం పెరిగి నేల సారవంతమవుతుందన్నారు. భూ సార పరీక్షలు చేయించుకోవడం ద్వారా నేల సారవంతాన్ని తెలుసుకోవచ్చని వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ పేర్కొంటూ...

వాయిస్...28 సెకన్లు

---------------------------

గ్రూప్-3 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ -టీజీపీఎస్సీ షెడ్యూల్‌ను

ప్రకటించింది. ఈ నెల 18 నుంచి జులై 8 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయంలో ధృవపత్రాల పరిశీలన జరగనుందని తెలిపింది. పరిశీలనకు ఎంపికైన గ్రూప్ –3 అభ్యర్థుల జాబితాను www.tgpsc.gov.inలో అందుబాటులో ఉంచినట్టు టీజీపీఎస్సీ పేర్కొంది.

-------------------------------

తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ వద్ద దివ్యదర్శన టోకెన్ల జారీ కేంద్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి అదనపు కార్యనిర్వాహణాధికారి వెంకయ్యచౌదరి నిన్న పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, భక్తుల సౌకర్యార్థం శ్రీవారి మెట్టు వద్ద దివ్యదర్శన టోకెన్లను నిలిపివేసి అలిపిరి వద్ద జారీ చేస్తున్నామన్నారు.

=====================